“మరొక చిన్న ప్రశ్న” అంది మేడమ్ ప్రమీలాదేవి.

‘సిద్ధమే’ అన్నట్లు తలూపింది మనస్విని.

“హిందీలో మొదటి మహిళా పత్రిక ఏది?”

మనస్విని మళ్ళీ మెదడు అరల్లో దాగిన ఆ విషయాన్ని గుర్తుచేసుకోవటానికి ప్రయత్నించసాగింది. క్షణాలు చకచకా దొర్లిపోతున్నాయి.

కొంత సమయం గడిచిన తర్వాత-- “గుర్తొచ్చింది మేడమ్ ..... ‘సుగృహిణి’. 1888 లో ప్రారంభించబడిన ఈ పత్రికకు హేమంత్‌కుమారీ చౌదరీ అనే బెంగాలీ వనిత సంపాదకురాలు, నిర్వాహకురాలూను. అప్పటికామె వయస్సు కేవలం ఇరవై ఏళ్ళు.”

ఆమెలో పూర్తిగా ఉత్సాహం ప్రవేశించిందనటానికి తేటపడిన ఆమె మోమే చెబుతుంది. మేడమ్ ప్రమీలాదేవి మనస్వినితో మాట్లాడుతూనే వుంది.

*   *   *   *   *

సమయం రాత్రి ఎనిమిదిన్నర!

అపోలో హాస్పిటల్ విద్యుద్దీపాల కాంతిలో మెరిసిపోతోంది. పీక్కుపోయిన మొహంతో అభిరాం, అలసటగా వరప్రసాదం మహదేవ్‌ని ట్రీట్‌చేస్తున్న డాక్టర్ గదిలో కూర్చున్నారు.

అతని పరిస్థితిని చెక్‌చేయడానికి పది నిమిషాలముందే ఇంటెన్సివ్‌కేర్‌వైపు నడిచాడు డాక్టర్.

అతను మహదేవ్ దగ్గరకు వెళుతుండగా అభిరాంలో కనిపించిన టెన్షన్ వరప్రసాదాన్ని కదిలించింది. అతని చేతిని మృదువుగా స్పృశించి ధైర్యం చెప్పాడు. మహదేవ్ హెల్త్ కండిషన్ మరికొన్ని క్షణాల్లో తెలుస్తుంది.

ఇంతలో నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ డాక్టర్ తిరిగివస్తున్నట్లు బూట్లచప్పుడు. అవి తన గుండెలమీద పడుతున్నట్లు ఉక్కిరిబిక్కిరయ్యాడు అభిరాం. “ఏమైంది? మహదేవ్ పరిస్థితి మెరుగైందా లేదా?’ నరాలు తెగిపోయే టెన్షన్.

*   *   *   *   *

వెలుగు ఓడిపోయి చీకటి రక్కసి కోరల్లో ఇరుక్కుపోతున్నవేళ-- సైనిక్‌పురి కాలనీవైపు సాగిపోతోందో ఆరడుగుల పైనున్న ఆకారం.

సాధారణంగా మనుషులు రెండడుగులు వేసి చేరుకునే దూరాన్ని ఒకే అడుగులో అధిగమించి సునాయాసంగా ముందుకు సాగిపోతోందా ఆకారం ..... సాధ్యమైనంతవరకూ వీధిదీపాల వెలుగు తనమీద పడకుండా జాగ్రత్తపడుతూ .....

అప్పటికీ రోడ్డుమీద పోతున్న ఒకరిద్దరు అతన్నీ, అతని ఆకారాన్నీ వీక్షిస్తూ విస్తుపోతున్నారు. అతని కనులు అర్ధనిమీలిత నేత్రాల్లా సగం మూసుకుని సగం తెరుచుకొని వున్నాయి. పెదాలు ఆగకుండా మంత్రపఠనం గాస్తున్నాయి. అతని చెవిలో విన్పిస్తున్న సన్నని హోరు దిక్సూచిలా మార్గదర్శకమై ముందుకు గొనిపోతోంది అతన్ని.

అతని వెనుక ఆకారంలేని ఏవో నీడలు గాలిలో నాట్యంచేస్తున్నట్లు ఝూంకారం విన్పిస్తోంది.

అతని గమ్యం దగ్గరయింది. రెండు మూడు వీధులు తిరిగి ఓ ఫ్లాట్ ముందుకు నడిచి ఆగాడు. చీకటిగా మనుష్యులు లేరన్న సంగతిని తెలియబరుస్తోందా ఫ్లాట్. అతని చెవిలోని హోరు చిత్రమైన రీతిలో రొదపెట్టింది.

అర్థమైనట్టు తల పంకించాడతను. తీక్షణంగా చూశాడా ఫ్లాట్‌వైపు కొద్దిసేపు. తరువాత సన్నగా మంత్రాలు పఠించాడు.

అతన్ని వెన్నంటి వచ్చిన నీడలు ఒక్కొక్కటిగా ఆ ఫ్లాట్‌వైపు దూసుకుపోయినట్లు గాలిని సర్రు సర్రుమని చీల్చుతున్న ధ్వనులు ..... చేయవలసిన పనిని విజయవంతంగా ముగించినట్లు చిన్నగా విచ్చుకున్నాయి అతని పెదవులు. వచ్చిన వాడు వచ్చినట్లే వెనుదిరిగాడు. వీధి మలుపు తిరుగుతుండగా విన్పించాయి అతనికి ..... కుక్కలు మొరుగుతున్న అరుపులు. అయినా ఆగలేదతను.

*          *          *          *          *

“భౌ ..... భౌ! భౌ ..... భౌ ..... భౌ ..... ” ఆగకుండా అరుస్తోంది సైనిక్‌పురీ కాలనీలో ఫ్లాట్ నెంబర్ నలభై ఒకటిలోని ఆల్సేషియన్! “ఛుప్! డాలీ నో నాయిస్” గదమాయించాడా ఇంటి యజమాని దానిని. అయినా ఆగలేదది. గొంతు పగిలిపోతుందేమో అన్నట్టు అరుస్తోంది పక్కఫ్లాట్‌లోకి చూస్తూ.

అప్పుడు చూశాడతను కూడా అటువైపు. దీపాలు లేక చీకటిగా వుందది. అతనికెందుకో అనుమానం వచ్చింది.

గబగబా ఇంట్లోకి నడిచి టార్చ్ తెచ్చి అటువైపు ఫోకస్ చేశాడు. దొంగెవరయినా దూరాడా? డాలీ ఇలా మొరుగుతుంది-- అనుకున్నాడతను.

చాలాసేపూ గమనించినా అటువంటి ఛాయలేమీ కారరాలేదు. డాలీ మాత్రం ఎగిరెగిరిపడుతూ అరుస్తోంది.

“ఏమిటివాళిది ఇలా సతాయిస్తోంది? తీసుకెళ్ళి స్టోర్ రూంలో కట్టేయండి” అతని భార్య అంది.

అతను దాన్ని లోపలకు తీసుకెళ్ళబోయాడు. అది గింజుకుంది.

“షటప్ డాలీ” కోపంగా అరిచాడతను. యజమాని వేపు కోపంతో చూస్తూ అది అరుపులాపేసి ‘గుర్ర్ర్’ మంటూ వుండిపోయింది. దాన్ని స్టోర్ రూంలో కట్టేసి హాల్లోకి నడిచాడతను.

టీవీలో సినిమా బిట్స్‌తో తయారయిన ప్రోగ్రామేదో వస్తోంది. చిరాకేసిందతనికి.

“ఎప్పుడూ వెధవ సినిమా బేస్డ్ ప్రోగ్రాంలే” అనుకుంటూ మరో ఛానల్ తిప్పాడు. అందులో సినిమా పాటలు వస్తున్నాయి. హీరో- హీరోయిన్లు అసహ్యాకరమైన భంగిమలతో

ఊగిపోతూ చిత్తుగా తాగిన ఆబోతుల్లా గెంతులేస్తున్నారు.

'రేపట్నుంచీ కేబుల్ కనెక్షన్ తీయించేయాలి' అనుకుని ఏదో పుస్తకం పట్టుకుని బెడ్‌రూంలోకి నడిచాడు. మంచంమీద పడుకుని పుస్తకం తెరవబోతూ మళ్ళీ చూశాడు. పక్క ఫ్లాట్‌లోకి కిటికీలోంచి.

చీకటిగా వుందే తప్ప, దొంగెవరూ పడిన జాడలేమీ తెలియలేదు. భార్య కోసం ఎదురుచూస్తూ పుస్తకం చదువుతుండిపోయాడతను.

*　　*　　*　　*　　*

"కంగ్రాట్స్ అభిరాంగారూ! మీ ఫ్రెండ్ హెల్త్ కండిషన్ నార్మల్ కొచ్చింది. బి.పి, పల్స్, హార్ట్ అన్నీ అబ్సల్యూట్లీ నార్మల్ కండిషన్లో పనిచేస్తున్నాయి. పాపం ఉదయం నుంచీ హైరానా పడుతున్నారు. ఇంటికెళ్ళి రెస్ట్ తీసుకొని ఉదయం రండి. మీ ఫ్రెండ్‌ని ఈ రాత్రంతా కేర్‌లోనే వుంచి రేపు వేరే రూమ్‌కి షిఫ్ట్‌చేస్తాం. నౌ హీ ఈజ్ ఆల్‌రైట్, డోంట్ వర్రీ ఎబౌట్ హిమ్" షేక్‌హేండిస్తూ అన్నాడు డాక్టర్.

అభిరాం కృతజ్ఞతగా అతనివంక చూశాడు. అతని గుండెలమీంచి పెద్ద భారం దిగిపోయినట్లయింది. వరప్రసాదం వైపు ఆనందంగా చూశాడు. అతను కూడా గండం గడిచినందుకు ఆనందించాడు.

"మీరింటికెళ్ళి రెస్ట్ తీసుకోండి" నాతోపాటు ఉదయం నుంచీ వుండిపోయారు" అన్నాడు అభిరాం.

"అవసరంలేదు అభిరాంగారూ! మీరిద్దరూ ఇంటి కెళ్ళచ్చు. పేషెంట్‌కేం ఫర్వాలేదు. వెళ్ళిరండి" అభయం ఇచ్చారు డాక్టర్.

తనకోసం అమ్మమ్మ ఎదురుచూస్తుందనీ. ఉదయం వచ్చేసేముందు కూడా ఏమీ చెప్పలేదని గుర్తొచ్చిందతనికి. అయిష్టంగానే యింటికెళ్ళాడు.

"ఉదయంనుంచీ ఇద్దరూ ఏమైపోయార్రా?" వాళ్ళని చూస్తూనే అడిగింది సుమతమ్మ.

"ఓ అర్జంట్ పనిమీద వెళ్ళాం అమ్మమ్మా" అని స్నానానికి బాత్‌రూంలోకి వెళ్ళాడు అభిరాం.

వరప్రసాదం కూడా స్నానం చేశాక ఇద్దరికీ వడ్డించింది సుమతమ్మ. అభిరాం అన్యమనస్కంగానే భోజనంచేసి లేచాడు.

'వీడి మనసెందుకో బాగాలేదు' అనుకుందామె. వరప్రసాదం కూడా సరిగ్గా తినలేకపోయాడు.

'ఇద్దరికీ ఏమైందీవాళ?' అనుకుందామె.

భోజనాలైపోయాక ఇద్దరూ అభిరాం గదిలోకి నడిచారు. ఇద్దరిలో ఎవరూ మాట్లాడుకోలేదు. మౌనంగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

'మహదేవ్‌ని వదిలేసి రాకుండా వుంటే బాగుణ్ను' అని అనుకున్నాడు అభిరాం.

'నేనైనా అక్కడుంటానంటే సరిపోను, మరీ అనాథలా అతన్ని ఒక్కడ్ని వదిలేసి వచ్చేశాం' అనుకున్నాడు వరప్రసాదం. చాలాసేపు మానసిక సంఘర్షణ తర్వాత ఇద్దరూ ఒకేసారి "హాస్పిటల్‌లో నేనుంటా" నంటే "నేనుంటాను" అని ఒకరు మరొకరితో అన్నారు. వరప్రసాదం తన మాటనే నెగ్గించుకున్నాడు.

"అమ్మమ్మ ఒంటరిగా వుంటుంది కదా! అందుకని నేనే వుంటాను. ఉదయమంతా మీరుండవచ్చు" అని.

"సరే" ననక తప్పలేదు అభిరాంకి.

"మరి నేను వెళ్ళొస్తాను" అన్నాడు వరప్రసాదం.

"దించుతాను" అన్నాడు అభిరాం.

"దగ్గరే కదా! నడుస్తాను. కాస్త వెన్నెల చల్లదనంతో మనస్సుకి ప్రశాంతతయినా వస్తుంది" అన్నాడతను.

మౌనంగా తలవూపాడు అభిరాం. సుమతమ్మకి చెప్పకుండానే బయటపడ్డాడు వరప్రసాదం.

పడుకున్నాడన్న మాటేకానీ అభిరాంకి నిద్రరాలేదు. జూబ్లీహిల్స్‌లోని బిల్డింగ్‌లు వెన్నెల్లో ఠీవిగా దర్పాలు ఒలకబోస్తూ వున్నట్లున్నాయి. అడపాదడపా కార్లు వస్తూపోతూ వున్నాయి.

వరప్రసాదం అపోలో ఆస్పత్రికి పదినిమిషాల్లో చేరుకున్నాడు. మహదేవ్ పరిస్థితి తెలుసుకుని--

"అంతా సవ్యంగానే వుంది" డాక్టర్ చెప్పడంతో తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు.

* * * * *

సమయం ఉదయం ఆరుగంటలవుతోంది.

అప్పటికే అభిరాం స్నానంచేసేసి, అర్జంటు పనుందని అమ్మమ్మతో చెప్పి అపోలో హాస్పటల్‌కి చేరుకున్నాడు. అతన్ని గమనించిన వరప్రసాదం ఎదురెళ్ళి అంతా సవ్యంగానే వుందన్నట్టు చిరునవ్వుతో ఆహ్వానం పలికాడు.

అభిరాం మొహం వికసించింది. "మీరింటికెళ్ళి రెస్ట్ తీసుకోండి" అని అతన్ని పంపించేశాడు.

తిన్నగా మహదేవ్ వున్న ఇంటెన్సివ్‌కేర్ వైపు నడిచాడు. కానీ అక్కడతను కనిపించలేదు. అతన్ని ట్రీట్ చేస్తున్న డాక్టర్ దగ్గరకు నడిచాడు.

"రండి. మీ ఫ్రెండ్‌ని ఇంటెన్సివ్ కేర్ నుంచి తరలించాం ..... ఆయనకి ఫర్వాలేదు" అన్నాడు అతను.

"నేనోసారి తనని చూడచ్చా?"

"వైనాట్ ..... కానీ అతను ప్రస్తుతం స్పృహలో లేడు. తలకి బలంగా గాయమైంది.

బహుశా సాయంత్రానికి మెలకువలోకి రావచ్చుతను" అంటూ లేచాడు డాక్టర్. మౌనంగా అతన్ని అనుసరించాడు అభిరాం.

డాక్టర్ చకచకా నడుస్తూ ఒక గదిముందాగి డోర్ తీశాడు.

లోపల బెడ్‌మీద వున్నాడు మహదేవ్. తలకి కట్లతో, పక్కనున్న స్టాండ్‌మీద తలకిందులుగా వేల్లాడుతున్న సెలైన్ బాటిల్స్ చేతికి అమర్చబడి.

అభిరాంకి అతనున్నాస్థితిలో చూసి ఒక్కక్షణం దిగులేసింది. డాక్టర్ మళ్ళీ తలుపుమూసి వెనుదిరిగాడు.

ఇద్దరూ డాక్టర్ గదిలో కూర్చున్నారు. కొంచెం సేపు మౌనం రాజ్యమేలిందక్కడ. ఆ మౌనాన్ని భరించలేనట్లు అన్నాడు అభిరాం .....

మహదేవ్‌కి తలకి గాయమైందన్నారు. మరేమి ఫర్వాలేదా డాక్టర్?" ఏదో దీర్ఘాలోచనలో వున్న డాక్టర్ వులిక్కిపడ్డట్టు అభిరాం వంక చూశాడు. మళ్ళీ తన ప్రశ్నని రిపీట్ చేశాడతను. దానికి వెంటనే ఏం సమాధానం చెప్పలేదు ఆ డాక్టర్,

అతని ముఖం ఏదో చెప్పడానికి సంసిద్ధుడైనట్లు ముందుకు వంగాడు. అభిరాం ధైర్యాన్ని కూడదీసుకుని అతను చెప్పే విషయాన్ని వినటానికి రెడీ అయ్యాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ డాక్టర్! మిమ్మల్నోసారి చీఫ్ రమ్మంటున్నారు"ఓ నర్సు వచ్చి చెప్పింది.

"ఎక్స్‌క్యూజ్‌మీ" అని బయటికి నడిచాడతను. అభిరాం నిట్టూర్చాడు. క్షణాలు నిమిషాలుగా రూపాంతరం చెంది అభిరాం సహనాన్ని పరీక్షిస్తున్నాయి.

ఇంతలో ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు- అభిరాం ద్వారం వంకే చూస్తున్నాడు.

అక్కడ ప్రత్యక్షమయ్యాడు వరప్రసాదం. అతన్ని చూడగానే కొండంత ధైర్యమొచ్చినట్టనిపించిందతనికి. అయినా బయటికి మాత్రం
"అరే! విశ్రాంతి తీసుకోపోయారా?" అన్నాడు.

"ఇంటి దగ్గరేం తోస్తుంది. అందుకే అన్ని పనులు త్వరత్వరగా ముగించుకుని వచ్చేశాను. మహదేవ్ విషయంలో డాక్టర్ చెప్పేదేమిటి!" అభిరాం పక్కనే కూర్చుని అడిగాడతను.

ఆ మాటతో మళ్ళీ అభిరాం మొహం పాలిపోవటం గమనించి-- 'మహదేవ్ పరిస్థితి విషమించిందా?' అనుకున్నాడు వరప్రసాదం.

"డాక్టర్ మహదేవ్ ప్రాణానికేం ప్రమాదం లేదని చెప్పాడు" అన్నాడు అభిరాం.

"అలాగా" తేలిగ్గా అన్నాడు వరప్రసాదం.

"కానీ ..... " అంటూ ఆపాడు అభిరాం.

"ఆఁ ..... కానీ?" ఆత్రుతగా అడిగాడు వరప్రసాదం.